బుధవారం 23-10-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 491 పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com



గాజు సీసాను పగలగొట్టి గాయపర్చుకున్న ఎంపీ

మిగతా 2లో



చత్తీస్‌గఢ్ నీటిలో ప్రమాదకరమైన యురేనియం

మిగతా 3లో



ఏటీఎం కార్డుపై రూ.10 లక్షల ఉచిత బీమా

మిగతా 4లో



కటౌట్ చూసి కొన్ని నమ్మేయాలి

మిగతా 5లో

## శాంతి కోసం భారత్ ఎప్పుడూ సిద్ధమే

### బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో మోడీ.. పుతిన్‌తో ద్వైపాక్షిక సమావేశం

**ముందడుగు జాతీయం:**

ప్రపంచంలో ఎవరూ ఆపదలో ఉన్నా, ఎక్కడైనా శాంతిని నెలకొల్పడానికి, ఇతరులకు సహాయం చేయడానికి భారతదేశం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ప్రధాని మోడీ అన్నారు. బ్రిక్స్ శిఖరాగ సదస్సులో పాల్గొనేందుకు రష్యా వెళ్లిన మోడీ మంగళవారం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ రష్యాఉక్రెయిన్ యుద్ధాన్ని ప్రస్తావిస్తూ.. వివాదాలకు శాంతియుత పరిష్కారాలను భారత్ విశ్వసిస్తుందని పేర్కొన్నారు. ఉక్రెయిన్‌తో యుద్ధానికి శాంతియుత పరిష్కారం కోసం ప్రయత్నం చేయాలని పుతిన్‌కు సూచించారు. "రష్యాఉక్రెయిన్ యుద్ధానికి



సంబంధించి మేము అన్ని వర్గాలతో టచ్‌లో ఉన్నాము. అన్ని వివాదాలను చర్చలతో పరిష్కరించుకోవాలనేది భారత్ వైఖరి.

మిగతా 2లో

## ధరణి పోర్టల్‌పై కీలక నిర్ణయం

### ఎన్ఐసీతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం





**ముందడుగు తెలంగాణ:**

తెలంగాణ ప్రభుత్వం ధరణి పోర్టల్ నిర్వహణ విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. ధరణి పోర్టల్ నిర్వహణను నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ)కి అప్పగించింది. ఈ మేరకు ఎన్ఐసీతో తెలంగాణ సర్కార్ ఒప్పందం చేసుకుంది.

మిగతా 2లో

## ఉపాధి కల్పనే దేశం ముందున్న అతిపెద్ద సవాల్

### ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



**ముందడుగు జాతీయం:**

దేశీయంగా సమర్థతను పెంచుకోవడంతో పాటు.. బయటి నుంచి వచ్చే సవాళ్లను తట్టుకొనేలా ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దాలని భావిస్తున్నట్లు సీతారామన్ చెప్పారు.

మిగతా 2లో



## తెలంగాణలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం

### పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ

**ముందడుగు తెలంగాణ:**

తెలంగాణలోని పలు జిల్లాల్లో రాబోయే రెండు రోజుల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. మంగళవారం ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్, వరంగల్, రంగారెడ్డి, హైదారాబాద్‌తో పాటు కామారెడ్డి జిల్లాలకు వర్ష సూచన ఉందని వాతావరణశాఖ ప్రకటించింది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

మిగతా 2లో

ముందడుగు
బుధవారం, 23-10-2024, హైదరాబాద్

# శాంతి కోసం భారత్ ఎప్పుడూ సిద్ధమే

(మొదటిపేజీ తరువాయి)
వివాదాలకు శాంతియుత పరిష్కారాలు ఉండాలని మేము విశ్వసిస్తున్నాము. శాంతిని నెలకొల్పడానికి సహాయం చేయడానికి భారతదేశం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుంది" అని ప్రధాని వ్యాఖ్యానించారు. గత మూడు నెలల్లో రష్యాలో తాను చేసిన పర్యటనలు రెండు దేశాల మధ్య సంబంధాలను మరింతగా పెంచాయని ప్రధాని మోడీ అన్నారు. బ్రిక్స్ సదస్సు కోసం కజాన్ వంటి అందమైన నగరాన్ని సందర్శించే అవకాశం నాకు లభించడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. కజాన్‌లో భారత కొత్త కాన్సులేట్ ప్రారంభిస్తామని తెలిపారు.

# ధరణి పోర్టల్‌పై కీలక నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)
మూడేళ్ల పాటు ధరణి పోర్టల్ నిర్వహణకు ఈ ఒప్పందం కుదిరింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పనితీరు బాగుంటే ఒప్పందాన్ని మరో రెండేళ్లు పొడిగిస్తామని తెలిపింది. భూముల రికార్డ్స్ మెయింటెనెన్స్‌లో పారదర్శకత, వేగవంతం కోసం పోర్టల్ నిర్వహణను కేంద్ర సంస్థకు అప్పగించినట్టు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం ధరణి నిర్వహణ బాధ్యతలను చూస్తున్న TerraCISతో ఒప్పందం ఈ ఏడాది నవంబర్ 30తో ముగియనుంది. ఈ నేపథ్యంలోనే ధరణి పోర్టల్‌కు సాంకేతిక భాగస్వామిని మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.




# గాజు సీసాను పగలగొట్టి గాయపర్చుకున్న ఎంపీ

## రసాభాసాగా వక్ఫ్ బిల్లుపై పార్లమెంటరీ కమిటీ సమావేశం

**ముందడుగు ఢిల్లీ:**
ఢిల్లీలో వక్ఫ్ బిల్లుపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ సమావేశంలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం జరగడంతో ఆగ్రహించిన తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ గాజు సీసాను పగలగొట్టడంతో ఆయన చేతికి గాయమైంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..

వక్ఫ్ (సవరణ) బిల్లు, 2024పై మంగళవారం ఢిల్లీలో జరిగిన సమావేశంలో తృణమూల్ కాంగ్రెస్, బిజెపి నేతలు పాల్గొన్నారు. బిజెపి ఎంపీ జగదాంబికా పాల్ అధ్యక్షతన ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీ రిటైర్డ్ న్యాయమూర్తులు, న్యాయవాదుల బృందం ప్రతిపక్షాల అభిప్రాయాలను వింటుండగా విపక్ష ఎంపీలు, అధికార బిజెపి ఎంపీలు పరస్పర ఆరోపణలు చేసుకున్నారు. కల్యాణ్ బెనర్జీకి బిజెపి ఎంపీ అభిజిత్ గంగోపాధ్యాయకు మధ్య వాగ్వాదం నెలకొంది. తీవ్ర ఆగ్రహానికి గురైన బెనర్జీ పక్కనే ఉన్న గాజు వాటర్ బాటిల్‌ను పగలగొట్టారు. దీంతో అతడి చేతికి గాయమయ్యింది. ఆయనకు ప్రథమ చికిత్స చేసి, ఆసుపత్రికి తీసుకెళ్లారు. బెనర్జీ ఈ విధంగా ప్రవర్తించినందుకు అతడిని పార్లమెంటరీ కమిటీ నుంచి సస్పెండ్ చేసినట్లుగా సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

## ఉపాధి కల్పనే దేశం ముందున్న

# అతిపెద్ద సవాల్

## ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

(మొదటిపేజీ తరువాయి)
భారత్‌లోని పెట్టుబడి అవకాశాలను ఆమె ప్రస్తావించారు. ఉపాధి కల్పనే దేశం ముందున్న అతి పెద్ద సవాలన్నారు. "చాలా మంది యువత డిగ్రీ పట్టాలతో బయటకు వస్తున్నారు. కానీ, తమకున్న అర్హతకు, సాధించిన ఉద్యోగానికి మధ్య వ్యత్యాసం ఉందని వారు భావిస్తున్నారు. ఈ లోటును భర్తీ చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. కృత్రిమ మేధ వంటి సాంకేతికతల్లో నైపుణ్యాన్ని అందించేందుకు యువతను సన్నద్ధం చేస్తోంది" అని ఆర్థిక మంత్రి అన్నారు. యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ గురించి ఆర్థిక మంత్రి ప్రస్తావించారు. భారత్ ప్లాస్టిక్ కార్డుల నుంచి క్యూఆర్ కోడ్‌కు వేగంగా మారినట్లు ఆమె తెలిపారు. చిరు దుకాణాలు, కూరగాయల కోసం కూడా దీనిని వినియోగిస్తున్నామన్నారు.



ఫలితంగా చెల్లింపులు మరింత పారదర్శకంగా మారాయని, నగదుపై ఆధారపడటం తగ్గిందన్నారు. థర్మల్ పవర్ ప్రాజెక్ట్ నుంచి సౌరశక్తి వంటి పునరుత్పాదక ఇంధనం వైపు వేగంగా మారుతోందన్నారు. కొలంబియా యూనివర్సిటీలో నిర్వహించిన ఓ సదస్సులో పాల్గొన్న మంత్రి ఉపాధి కల్పన, ఆర్థిక వృద్ధి తదితర అంశాలపై నిర్మలా సీతారామన్ మాట్లాడారు.

## తెలంగాణలో మోస్తరు

# వర్షాలు కురిసే అవకాశం

(మొదటిపేజీ తరువాయి)
ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతంలో కొనసాగిన అల్పపీడనం పశ్చిమ వాయువ్యదిశగా కదులుతూ మంగళవారం ఉదయం వాయుగుండంగా మారింది. ఇది పశ్చిమ వాయువ్యదిశగా కదులుతూ మరింత బలపడి ఈ నెల 23న తూర్పు మధ్య బంగాళాఖాతంలో తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. ఇది వాయువ్య దిశగా కదులుతూ 24న ఉదయానికి తీవ్ర తుపానుగా ఉద్ధృతి చెంది ఒడిశాపశ్చిమబెంగాల్ తీరాన్ని 24న రాత్రి లేదా 25న ఉదయం పూరి, సాగర్ ఐలండ్స్ మధ్య దాటే అవకాశం ఉందని వాతావరణశాఖ అంచనా వేసింది. దీని ప్రభావం తెలంగాణపై ఉండే అవకాశం లేదని అధికారులు తెలిపారు.



# ఫేక్ కోర్టు ఏర్పాటు చేసి న్యాయ విచారణ

## దొంగ న్యాయమూర్తిని అరెస్ట్ చేసిన పోలీసులు

**ముందడుగు గుజరాత్:**
సోషల్ మీడియా పుణ్యమే, మరెదో తెలియదు కాని కొంతమంది వింత మోసాలకు పాల్పడుతూ కటకటాల పాలవుతున్నారు. అలాంటిది న్యాయమూర్తిలా చలామణి అవుతున్న ఓ మోసగాడిని అహ్మదాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. మోరిస్ శామ్యూల్ క్రిస్టియన్ అనే వ్యక్తి నకిలీ ట్రైబ్యునల్‌ను ఏర్పాటు చేశాడు. దానిలో అతడే న్యాయమూర్తి. సిటీ సివిల్ కోర్టులోని భూవివాదాల పెండింగ్ కేసులకు సంబంధించిన వ్యక్తులను ట్రాప్ చేశాడు. అనంతరం తాను ఏర్పాటు చేసిన కోర్టుకు వారిని పిలిపించి విచారణ నిర్వహించాడు. కొందరికి అనుకూలంగా తీర్పులిచ్చాడు. ఇందుకుగాను బాధితుల నుంచి కేసు స్థాయిని బట్టి డబ్బులు వసూలు చేశాడు.

ముందడుగు
బుధవారం, 23-10-2024, హైదరాబాద్

# చత్తీస్‌గఢ్ నీటిలో ప్రమాదకరమైన యురేనియం

## 6 జిల్లాల్లో తీవ్రస్థాయిలో ఉందని వెల్లడి



ముందడుగు ఛత్తీస్‌గఢ్:

ఛత్తీస్‌గఢ్‌లోని 6 జిల్లాల్లోని నీటిలో ప్రమాదకరమైన స్థాయిలో "యురేనియం" ఉందని తేలింది. అణు కార్యక్రమాల్లో ఉపయోగించి యూరేనియం మోతాదుకి మించి నీటిలో ఉండటం ప్రమాదాన్ని సూచిస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం.. ఒక లీటర్‌నీటిలో 15 మైక్రోగ్రాముల పరిమిత, ప్రభుత్వం ప్రకారం లీటర్ నీటిలో 30 మైక్రోగ్రాములతో పోలిస్తే ఈ నీటిలో యురేనియా మూడు నుంచి నాలుగు రెట్లు అధికంగా ఉంది. నీటిలో ఈ స్థాయిలో యురేనియం ఉండటం ప్రజల్లో క్యాన్సర్లు, ఊపిరితిత్తుల రోగాలు, చర్మ, మూత్రపిండాల వ్యాధులకు కారణం అవుతుంది.

ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్, రాజ్‌నంద్‌గావ్, కంకేర్, బెమెతర, బలోడ్, కవార్ధా ప్రాంతాలలోని తాగు నీటి నమూనాల పరీక్షలలో లీటరుకు 100 మైక్రోగ్రాముల కంటే ఎక్కువ యురేనియం స్థాయిలు కనుగొనబడ్డాయి. 2017లో డబ్ల్యూహెచ్‌ఓ లీటర్ నీటిలో 15 మైక్రోగ్రాముల పరిమితికి మించకూడదని సూచించింది. డబ్ల్యూహెచ్‌ఓ భారత్ లాంటి కొన్ని దేశాల్లో ఈ పరిమితిని రెట్టింపు చేసింది. జూన్‌లో భాభా అటామిక్ రీసెర్చ్ సెంటర్ అధ్యయనం లీటరుకు 60 మైక్రోగ్రాములు కూడా సురక్షితమని సూచించింది.



# నిర్దోషికి క్షమాపణలు చెప్పిన పోలీస్ బాస్

## 58 ఏళ్ల తర్వాత నిర్దోషిగా జైలు నుంచి విడుదల

ముందడుగు జాతీయం:

కొంతమందికి చేయని తప్పుకు కూడా శిక్షలు పడి జైళ్లలో మగ్గిపోతున్నవారు ఉన్నారు. వారు నిర్దోషిగా విడుదలయ్యే సమయానికి వారి వయస్సు దాటిపోతుంది. అలాంటిది జపాన్‌లో షిజుకా జిల్లాకు చెందిన పోలీసు బాస్.. ఓ నిర్దోషికి క్షమాపణలు చెప్పారు.

వివరాల్లోకి వెళ్తే.. 1966లో ఓ మర్డర్ కేసులో ఐవా హకమడాను అరెస్టు చేశారు. 88 ఏళ్ల హకమాడాకు ఆ కేసులో నిజానికి మరణశిక్ష విధించారు. కానీ అతను ఆ కేసులో అత్యున్నత కోర్టును ఆశ్రయించడంతో మూడు దశాబ్ధాల పాటు వాదనలు జరిగాయి. ఆ తర్వాత మళ్లీ పునర్ దర్యాప్తుకు కోర్టు అంగీకరించింది. దీంతో 2014లో మళ్లీ అతనిపై ఉన్న కేసులో దర్యాప్తు చేపట్టారు. ఈసారి నిర్వహించిన విచారణలో హకమడా నిర్దోషిగా తేలాడు. సుమారు 58 ఏళ్ల జైలు శిక్ష తర్వాత అతన్ని కోర్టు నిర్దోషిగా విడుదల చేసింది. ఈ మధ్యే ఇంటికి చేరుకున్న అతనికి ఆ జిల్లా పోలీసు చీఫ్ క్షమాపణలు చెప్పారు. విచారణలో పొరపాటు జరిగినట్లు తెలిపారు. మా వల్ల నీకు తీవ్రమైన మానసిక క్షోభ మిగిలిందని, అది మాటల్లో చెప్పలేమని, దానికి సారీ చెబుతున్నట్లు ఆ పోలీసు బాసు వెల్లడించారు.

## గ్లోబల్ స్కేల్ రేటింగ్‌లలోకి ప్రవేశాన్ని ప్రకటించిన

# కేర్‌ఎడ్జ్

ముందడుగు హైదరాబాద్:

కేర్‌ఎడ్జ్ గ్లోబల్ ఐఎఫ్ఎస్ సి లిమిటెడ్, భారతదేశంలోని ప్రముఖ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీలలో ఒకటైన కేర్ రేటింగ్స్ లిమిటెడ్ యొక్క అనుబంధ సంస్థ 39 దేశాలకు సోవరిన్ రేటింగ్స్ ఆఫ్ గ్లోబల్ ఎకానమీస్‌పై తన నివేదికను ఈరోజు ఆవిష్కరించింది. రేటింగ్ ఏజెన్సీ భారతదేశానికి కేర్‌ఎడ్జ్ బిబిబి+ దీర్ఘకాల విదేశీ కరెన్సీ రేటింగ్‌ను కేటాయించింది. దీనితో కేర్ ఎడ్జ్ దాని అనుబంధ సంస్థ కేర్‌ఎడ్జ్ గ్లోబల్ ఐఎఫ్ఎస్ సి లిమిటెడ్ ద్వారా గ్లోబల్ స్కేల్ రేటింగ్స్ స్పేస్‌లోకి ప్రవేశించిన మొదటి భారతీయ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీగా అవతరించింది.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, మిస్టర్ మెహుల్ పాండ్యా ఎండీ & గ్రూప్ సిఈఓ కేర్‌ఎడ్జ్ మాట్లాడుతూ "ప్రపంచ నాలెడ్జ్‌ఆధారిత సంస్థగా మారే దిశగా మా ప్రయాణంలో ఇది మాకు ఒక ముఖ్యమైన మైలురాయి. భారతదేశం యొక్క ఆర్థిక ప్రభావం పెరిగేకొద్దీ, భారతీయ కంపెనీ ఈ డొమైన్‌లోకి ప్రవేశించడం సమయానుకూలమైనది మరియు సముచితమైనది అని అన్నారు.

# నా ఫిర్యాదుకు పోలీసులు నవ్వారు

## బాలీవుడ్ ప్రముఖ నటుడు అనుపమ్ ఖేర్

ముందడుగు జాతీయం:

జీవితంలో ఎదుర్కొన్న కష్టాలు, పడిన అవమానాలు గురించి బాలీవుడ్ ప్రముఖ నటుడు అనుపమ్ ఖేర్ తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడారు. ఓ సారి తన కారు చోరీకి గురికాగా ఫిర్యాదు చేస్తుంటే పోలీసులు నవ్వారని నాటి చేదు జ్ఞాపకాన్ని గుర్తు చేసుకున్నారు. 'కార్తికేయ 2', 'టైగర్ నాగేశ్వరరావు' చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు.

"నాకు డ్రైవింగ్ చేయడం నచ్చదు. కానీ, ఓ రోజు అమ్మవారి దేవాలయానికి (ముంబయి) నేనే కారు డ్రైవ్ చేస్తూ వెళ్లా. కారును పార్క్ చేసి ఆలయ ప్రాంగణంలోకి చేరుకున్నా. అక్కడి నుంచి చూస్తుంటే.. నా కారును ఓ వ్యక్తి తీసుకెళ్లడం కనిపించింది. వెంటనే కిందికి వచ్చి ఆటో ఎక్కి.. ఆ కారును ఫాలో అవ్వమని ఆటో డ్రైవర్‌కు చెప్పా. మేం అతడిని పట్టుకోలేకపోయాం. చేసేదేం లేక ఫిర్యాదు చేద్దామని సమీప పోలీసు స్టేషన్‌కు వెళ్లా. నా వాహనం ఎలా పోయిందో పోలీసులకు వివరిస్తుంటే.. వారు పొట్ట చెక్కలయ్యేలా నవ్వారు. అది వారికి సినిమాల్లో కనిపించే సన్నివేశంలా అనిపించింది" అని అన్నారు.





# పిఆర్టీయు ఆధ్వర్యంలో ఓటర్ నమోదు

## జిల్లా ప్రధాన కార్యదర్శి కోకిల శ్రీరంగం

ముందడుగు ములుగు:

వాజేడు మండలంలో టీచర్స్ ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యక్రమంలో భాగంగా పిఆర్టీయు టిఎస్ ఆధ్వర్యంలో ఓటర్ నమోదు ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కోకిల శ్రీరంగం మాట్లాడుతూ పీఆర్టియుటిఎస్ అధికార అభ్యర్థి పింగిలి శ్రీపాల్ రెడ్డిని గెలిపించాలని అందుకు గాను ఉపాధ్యాయులు తమ ఓటును నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాజేడు మండల పిఆర్టియు టిఎస్ అధ్యక్షులు కోరిక స్వరూప్ సింగ్, ప్రధాన కార్యదర్శి ఆక దామోదర్ ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముందడుగు
బుధవారం, 23-10-2024, హైదరాబాద్

# సైబర్ నేరాలపై అవగాహన




ముందడుగు హైదరాబాద్:

రోజురోజుకి పెరిగిపోతున్న సైబర్ నేరాల గురించి ప్రజలకు ఘట్ కేసర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, స్కై ఫౌండేషన్ సంయుక్తంగా ప్రజల మధ్యలో సైబర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ సి ఐ పరశరాములు, ఎస్ ఐ శ్రీకాంత్, హెడ్ కానిస్టేబుల్ కె. మధుమోహన్, ఆర్మీ రిజర్వ్ డ్ కానిస్టేబుల్ నరేష్, స్కై ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్. వై. సంజీవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భర్త దీర్ఘాయుష్షు కోసం
# భార్య ఉపవాసం

### ఉపవాసం పూర్తికాగానే భర్తను చంపిన భార్య



ముందడుగు ఉత్తరప్రదేశ్:

ఓ మహిళ భర్త దీర్ఘాయుష్షు కోసం ఉపవాసం ఉండి ప్రార్థనలు చేసింది. పూజలు పూర్తైయిన కొన్ని గంటలకే భార్య భర్తకు విషమిచ్చి చంపేసింది. ఉత్తరప్రదేశ్‌లోని కౌశంబి జిల్లా ఇస్మాయిల్‌పూర్‌లో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం తన భర్త శైలేశ్ కుమార్(32)కు వేరే మహిళతో సంబంధం ఉందన్న అనుమానం కారణంగా సవిత అనే మహిళ ఈ ఘాతుకానికి ఒడిగట్టింది. కర్వా చౌత్ పండుగ సందర్భంగా భర్త దీర్ఘాయుష్షు కోసం ఆదివారం సవిత ఉపవాసం ఉంది. శైలేశ్ పండగ ఏర్పాట్లలో బిజీగా ఉన్నారు. సాయంత్రం ఉపవాసం విరమించిన తర్వాత సవిత తన భర్తతో గొడవ పడింది. అయితే ఆ తర్వాత పరిస్థితి సద్దుమణిగినట్టు కనిపించింది. దంపతులిద్దరూ కలిసి భోజనం చేశారు. ఆ తర్వాత భర్తను పక్కింటికి వెళ్లి ఏదో వస్తువు తెమ్మని చెప్పి సవిత పారిపోయింది. శైలేశ్ తిన్న భోజనంలో విషం కలిసిందని తెలిసి అతడిని దవాఖానకు తరలించారు. అక్కడ అతడి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. చికిత్స పొందుతూ శైలేశ్ మృతి చెందాడు. పోలీసులు సవితను అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఏటీఎం కార్డుపై రూ.10 లక్షల ఉచిత బీమా

### కొన్ని డెబిట్ కార్డులపై రూ. 3 కోట్ల వరకు కవరేజీ

### ఏటీఎం కార్డును 45 రోజుల కంటే ఎక్కువ ఉపయోగిస్తే బీమా




ముందడుగు ప్రత్యేకం:

ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ ఏటీఎం కార్డు వాడుతున్నారు.. కాని డిజిటల్ కాలం రావడంతో ఏటీఎం వాడకం కాస్త తగ్గిపోయింది. ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన, రూపే కార్డ్ కారణంగా ప్రతి ఒక్కరి రోజువారీ జీవితంలో ఏటీఎం ఒక ముఖ్యమైన భాగంగా మారింది. నగదుపై ఆధారపడటాన్ని తగ్గించడమే కాకుండా లావాదేవీలు కూడా సులువుగా మారాయి. ఏదైనా కొనాలంటే ఏటీఎం ద్వారా సులువుగా చేసుకోవచ్చు. ఏటీఎం అనేక సౌకర్యాలను కూడా అందిస్తుందని మీకు తెలుసా? కానీ సమాచారం లేకపోవడంతో ప్రజలు దాని ప్రయోజనాలను పొందలేకపోతున్నారు. అదేవిధంగా ప్రీమియం చెల్లించకుండానే ఏటీఎం ద్వారా బీమా కూడా లభిస్తుంది.

### ఆకాల మరణానికి ఇన్సూరెన్స్

బ్యాంకు ద్వారా ఏటీఎం కార్డు జారీ అయిన వెంటనే అదేవిధంగా, కార్డుదారులకు ప్రమాద బీమా, అకాల మరణ బీమా లభిస్తుంది. దేశంలో చాలా మందికి దీని గురించి తెలియదు. వారు డెబిట్ (ఏటీఎం) కార్డ్‌పై జీవిత బీమా రక్షణను కూడా పొందుతారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్ ప్రకారం, పర్సనల్ యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ (డెత్) నాన్ ఎయిర్ ఇన్సూరెన్స్ డెబిట్ కార్డ్ హోల్డర్‌కు అకాల మరణానికి బీమా అందిస్తోంది.

### ఏటీఎం కార్డుపై ఉచిత బీమా మొత్తం

మీరు ఏదైనా బ్యాంకు ఏటీఎం కార్డును 45 రోజుల కంటే ఎక్కువ ఉపయోగించినట్లయితే, మీరు ఉచిత బీమా సౌకర్యాన్ని పొందవచ్చు. ఇందులో ప్రమాద బీమా, జీవిత బీమా రెండూ ఉంటాయి. ఇప్పుడు మీరు ఈ రెండు పరిస్థితుల్లోనూ బీమాను క్లెయిమ్ చేయగలుగుతారు. కార్డు కేటగిరీని బట్టి మొత్తం నిర్ణయిస్తారు. ఎస్‌బీఐ తన గోల్డ్ ఏటీఎం కార్డ్ హోల్డర్‌లకు 4 లక్షలు (ఎయిర్ ఆన్ డెత్), 2 లక్షలు (నాన్‌ఎయిర్) కవర్ ఇస్తుంది. అయితే, ఇది ప్రీమియం కార్డ్ హోల్డర్‌లకు 10 లక్షలు, ఇతరులకు 5 లక్షల వరకు కవరేజీ అందిస్తుంది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఐసిఐసిఐ, కోటక్ మహీంద్రా బ్యాంక్‌తో సహా అన్ని బ్యాంకులు తమ డెబిట్ కార్డ్‌లపై వివిధ మొత్తాలను కవర్ చేస్తాయి. కొన్ని డెబిట్ కార్డులు రూ. 3 కోట్ల వరకు ఉచిత ప్రమాద బీమా కవరేజీని అందిస్తాయి. ఈ బీమా కవరేజీ ఉచితంగా అందిస్తుంది. ఇందులో బ్యాంకు ఎలాంటి అదనపు పత్రాలు అడగదు.

### డెబిట్ కార్డ్ ద్వారా లావాదేవీలు చాలా ముఖ్యమైనవి

నిర్దిష్ట వ్యవధిలోగా ఆ డెబిట్ కార్డ్ ద్వారా కొన్ని లావాదేవీలు జరిపినప్పుడే బీమా ప్రయోజనం లభిస్తుంది. వివిధ కార్డ్‌లకు ఈ వ్యవధి మారవచ్చు. కొన్ని ఏటీఎం కార్డ్‌లు బీమా పాలసీని యాక్టివేట్ చేయడానికి కార్డ్ హోల్డర్ కనీసం 30 రోజుల్లో ఒక లావాదేవీని చేయాల్సి ఉంటుంది. బీమా కవరేజీని క్లెయిమ్ చేయడానికి కొంతమంది కార్డ్ హోల్డర్‌లు గత 90 రోజులలోపు ఒక లావాదేవీని చేయాల్సి ఉంటుంది.

ముందడుగు
బుధవారం, 23-10-2024, హైదరాబాద్

# కటౌట్ చూసి కొన్ని నమ్మేయాలి

ప్రస్తుతం ఉన్న సక్సెస్‌ఫుల్ నటవారసులంతా 'తండ్రులకి తగ్గ తనయులు', 'అన్నలకు తగ్గ తమ్ముళ్లు', 'తాతలకు తగ్గ మనవళ్లు'. కానీ ప్రభాస్‌ను మాత్రం వీరితో మినహాయించాలి. ఎందుకంటే.. ప్రభాస్ 'తండ్రికి తగ్గ తనయుడు' కాదు. 'తండ్రిని మించిన తనయుడు'. ఈ మాటను నిర్మొహమాటంగా, నిర్భయంగా ఢంకా బజాయించి మరీ చెప్పేయొచ్చు. స్వతహాగానే ఆయన పెదనాన్న కృష్ణంరాజు ఛాతి కాస్త వెడల్పు. ప్రభాస్ పుణ్యమా అని.. గోరంత గర్వంతో.. కొండంత ఆనందంతో అది ఇంకాస్త వెడల్పయింది. జీవించి ఉన్నంతకాలం పెదనాన్నకు కావల్సినంత పుత్రోత్సాహాన్ని ఇచ్చేసిన తనయుడు ప్రభాస్. **2004** సంక్రాంతి గుర్తుందా? ప్రభాస్ మూడో సినిమా 'వర్షం'. కాసుల వర్షమే కురిపించేసింది. 'ఛత్రపతి'లో 'ఒక్క అడుగు' అని అడిగినందుకు అభిమానులు అడుగడుగునా గుండెలలో గుడులు కట్టేశారు. ఇక 'బాహుబలి' గురించి చెప్పేదేముంది.. ప్రపంచవ్యాప్తంగా పద్దెనిమిది వందల కోట్లు. 'సలార్' **600**కోట్లు. రీసెంట్ హిట్ 'కల్కి **2898** ఏడీ' వెయ్యికోట్లు. ప్రస్తుతం ప్రభాస్ సినిమా హిట్ అయితే వెయ్యికోట్లు. ఫ్లాపైతే **200**కోట్లు. అసలు 'ఈశ్వర్' టైమ్‌లో ఇంతటి వైభవం ఊహించామా!? పాన్ ఇండియా స్టార్‌డమ్‌ని ప్రపంచానికి పరిచయం చేయడమంటే సామాన్యమైన విషయమా!? .. కటౌట్‌ని చూసి కొన్ని కొన్ని నమ్మేయాలి.. తప్పదు. నేడు ప్రభాస్ పుట్టినరోజు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అభిమనులకు ఇదే పెద్ద పండగ.





# నా ఫార్ములా అదే!

నిత్యామీనన్ ప్రతిభాపాటవాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కెరీర్ ఆరంభం నుంచి అభినయ ప్రధాన పాత్రల్లో మెప్పిస్తున్నది. 'తిరుచిత్రంబళం' చిత్రానికిగాను ఇటీవలే ఉత్తమ నటిగా జాతీయ పురస్కారాన్ని అందుకుంది. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో సినిమాల ఎంపికలో తన ప్రాధాన్యతల గురించి వివరించింది నిత్యామీనన్. ఆమె మాట్లాడుతూ 'పాత్రల ఎంపికలో నాకు కొన్ని నిశ్చితాభిప్రాయాలున్నాయి. ముఖ్యంగా భారీ బడ్జెట్‌తో తీసే కమర్షియల్ సినిమాల్లో నటించడం అస్సలు ఇష్టం ఉండదు. వాటిలో కథానాయిక పాత్రకు అంతగా ఇంపార్టెన్స్ ఇవ్వరు. అలాంటి అవకాశాలు వస్తే సున్నితంగా తిరస్కరిస్తాను. పాత్ర నచ్చితే చిన్న సినిమా అయినా చేస్తాను. కెరీర్ ఆరంభం నుంచి ఇదే ఫార్ములా ఫాలో అవుతున్నా' అని చెప్పింది. ప్రస్తుతం నిత్యామీనన్ విజయ్ సేతుపతితో కలిసి ఓ తమిళ సినిమా చేస్తున్నది. దీనితో పాటు ధనుష్ 'ఇడ్లీకడై' సినిమాలో కథానాయికగా నటిస్తున్నది.